ఒకరు పథకాలన్నారు.. ప్రజా సంక్షేమం అన్నారు.. వలంటీర్లు దేవుళ్లన్నారు, కాబోయే నాయకులన్నారు.. ఒడిలో వేలు కుమ్మరించామన్నారు.. అభివృద్ధే గెలిపిస్తుందని దబాయించి చెప్పారు.

మరొకరు మరింత సంక్షేమం మా లక్ష్యం అని ఎలుగెత్తి ప్రకటించారు. పెంచిన పింఛను లెక్కలు కళ్లముందు తళతళలాడించారు. అభివృద్ధికి అసలైన చిరునామా మేమే అన్నారు.

నిజానికీ అబద్ధానికీ నడుమ రేఖ చెరిగిపోయింది. భయమా.. భరోసానా..? ఏది పనిచేసింది? ఏ బటన్ దేన్ని నొక్కింది? వెదజల్లిన వందల కోట్లు ఏమి పలికించబోతున్నాయి?

జనం నొక్కిన బటన్ ఎవర్ని పాతాళానికి తొక్కిందో, ఎవర్ని గద్దెనెక్కించిందో అంతుపట్టక లబ్‌డబ్ గుండెలతో రోజులు గడిపేశారు. రహస్యాన్ని గుండెల్లో దాచుకున్న పెట్టెలు నేడు నోళ్లు విప్పబోతున్నాయి. నాయకులారా బహు పరాక్!

తేలనున్న పార్టీల, అభ్యర్థుల భవితవ్యం

ప్రధాన పార్టీల శ్రేణులతో తిరుపతిలో లాడ్జీలన్నీ ఫుల్

టీడీపీ కూటమి అభ్యర్థులు



వరప్రసాద్, తిరుపతి పార్లమెంట్
నాని, చంద్రగిరి
శ్రీనివాసులు, తిరుపతి
సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి
రామకృష్ణ, వెంకటగిరి
సునీల్‌కుమార్, గూడూరు
ఆదిమూలం, సత్యవేడు
విజయశ్రీ, సూళ్లూరుపేట



వైసీపీ అభ్యర్థులు


గురుమూర్తి, తిరుపతి పార్లమెంట్
మోహిత్ రెడ్డి, చంద్రగిరి
అభినయ్, తిరుపతి
మధుసూదన రెడ్డి, శ్రీకాళహస్తి
రామ్‌కుమార్ రెడ్డి, వెంకటగిరి
మురళీధర్, గూడూరు
రాజేశ్, సత్యవేడు
సంజీవయ్య, సూళ్లూరుపేట





దేవుడా.. దేవుడా.. దేవుడా!

ఎన్నికల ఫలితాల వెల్లడి నేడే

తిరుపతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా సాగిన సార్వత్రిక ఎన్నికల్లో విజేతలెవరో నేడు తేలిపోనుంది. మంగళవారం మధ్యాహ్నానికల్లా వెల్లడయ్యే ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రధాన పార్టీలతో పాటు ఆయా పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి. నామినేషన్ల దాఖలు నాటి నుంచీ ఇప్పటి దాకా ప్రధాన పార్టీల నేతల్లో కనిపించిన బింకం కనుమరుగై ఆందోళన, ఆదుర్దా పెరుగుతుండగా ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో, ఏ అభ్యర్థి గెలుస్తారోనన్న ఉత్కంఠ రాజకీయ పార్టీల శ్రేణులతో సమానంగా జనంలోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొందిగత నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలు రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీలకు అత్యంత కీలకంగా పరిణమించిన నేపథ్యంలో దాని ప్రభావం జిల్లాలోనూ ప్రతిఫలించిన సంగతి తెలిసిందే. అధికార పార్టీ అభ్యర్థులు, టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు సర్వ శక్తులూ ఒడ్డారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమవైపే నిలిచారని అధికార పార్టీ అభ్యర్థులు గట్టిగా నమ్ముతుండగా ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు ఆకర్షణీయమైన మేనిఫెస్టో కారణంగా మెజారిటీ ప్రజలు తమకు మద్దతిచ్చారని టీడీపీ కూటమి అభ్యర్థులు బలంగా విశ్వసిస్తున్నారు. అయితే ఇరు పక్షాల ప్రచార హోరు, పంపకాల జోరు, వ్యూహాల తీరు చూశాక ఎన్నికలు పోటాపోటీగా జరిగాయనేది తేటతెల్లమైంది. దీంతో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుందో, ఏ అభ్యర్థి గట్టెక్కుతారో ముందుగా అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. పైకి వైసీపీ, టీడీపీ కూటమి అభ్యర్థులు బింకంగా గెలుపు తమదేనని చెబుతున్నప్పటికీ ఇరు పక్షాల్లోనూ ఫలితాలపై ఆందోళన, ఆదుర్దా వ్యక్తమవుతోంది. ఇరు పార్టీల అభ్యర్థులూ శక్తికి మించి ఎన్నికల్లో ఖర్చు చేశారు. పోటీ తీవ్రత కారణంగా పల్లె నుంచీ పట్టణాల్లోని వార్డుల దాకా వర్గాలు నిట్టనిలువునా చీలిపోయాయి. ఆ మేరకు ఉద్రిక్తతలూ పెరిగాయి. ప్రత్యర్థి పక్షం గెలిస్తే తాము కక్ష సాధింపు చర్యలకు గురవుతామన్న భయం, ఆందోళనా ఇరువైపులా వెంటాడుతోంది. దీనికి తోడు చాలామంది అభ్యర్థులకు ఈ ఎన్నికలు చావోరేవో అన్నట్లు మారింది. ఓడితే తదుపరి ఎన్నికల నాటికి రాజకీయంగా తమ ఉనికి వుంటుందో లేదోనన్న అభద్రత నెలకొంది. వీటన్నింటి కారణంగా ఓట్ల లెక్కింపు ఫలితాలు రెండు పక్షాల అభ్యర్థుల్లోనూ టెన్షన్ పెంచుతున్నాయ్.

జయాపజయాలపైనే అభ్యర్థుల భవితవ్యాలు

వెంకటగిరిలో మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడు రామ్‌కుమార్ వైసీపీ తరఫున తొలి ఎన్నికలు ఎదుర్కొంటున్నారు. ఫలితాలపైనే ఆయన రాజకీయ భవితవ్యం ఆధారపడి వుంది. ఒకవేళ ఓడితే వైసీపీలో వర్గ రాజకీయాల కారణంగా నియోజకవర్గంపై ఆయన పెత్తనం కొనసాగకపోవచ్చు. అలాగే సత్యవేడులో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్ ఓడితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిష్ఠ దెబ్బతినే అవకాశముంది. ధిక్కరించి టీడీపీలో చేరి పోటీ చేసిన కోనేటి ఆదిమూలం మంత్రి ఆధిపత్యాన్ని దెబ్బతీసినట్టు అవుతుంది. అదే సమయంలో సత్యవేడులో రాజేశ్ భవిష్యత్తు అనిశ్చితంగా మారనుంది. తిరుపతిలో ప్రధాన పార్టీల్లో ఏ అభ్యర్థి ఓడినా వారి భవితవ్యం ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి. చంద్రగిరిలో కూడా ఓడిన వారి ప్రాబల్యం, ఆధిపత్యం తగ్గుముఖం పట్టే అవకాశముంది. సూళ్ళూరుపేటలో సైతం ఓడిన అభ్యర్థి రాజకీయ భవితవ్యం ఇబ్బందికరంగా మారనుంది. అధికారంలోకి వచ్చే పార్టీని బట్టి జిల్లాలో సమీకరణలు సమూలంగా మారిపోనున్నాయి.

తిరుపతికి తరలిన ప్రధాన పార్టీల శ్రేణులు

ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీల శ్రేణులు తిరుపతికి చేరుకున్నాయి. వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ తదితర ప్రధాన పార్టీల నాయకులు ఒక రోజు ముందుగానే తిరుపతికి చేరుకున్నారు. అభ్యర్థులు సైతం జనరల్ ఏజంట్లను, కౌంటింగ్ ఏజంట్లను వెంటబెట్టుకుని సోమవారం సాయంత్రానికే తిరుపతి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4గంటలకే ఏజంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చేరాలి కాబట్టి ముందస్తుగా వారు తిరుపతి వచ్చారు. మిగిలిన గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, పార్టీల సానుభూతిపరులు మంగళవారం తిరుపతి తిరుపతికి తరలిరానున్నారు. చాలామంది ముందస్తుగానే గదులు బుక్ చేసుకున్నారు. పగలంతా ఎండ, ఉక్కపోత భరించలేక గదుల్లో విశ్రాంతి తీసుకుని తుది ఫలితాలు వెల్లడయ్యే సమయానికి కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకునేలా పలువురు ప్లాన్ చేసుకున్నారు. దానికి తోడు పోలీసు కఠిన ఆంక్షల వల్ల కూడా కౌంటింగ్ కేంద్రాలకు సమీపంగా వుండలేని పరిస్థితులు నెలకొన్నాయి. అది కూడా గదులు తీసుకునేందుకు కారణమవుతోంది. దీంతో నగరంలోని లాడ్జీలన్నీ దాదాపు ఫుల్ అయిపోయాయి.

జనంలోనూ తీవ్ర ఉత్కంఠ

జిల్లావ్యాప్తంగా సామాన్య జనంలో కూడా ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏ పార్టీ విజయం సాధిస్తుందో, జిల్లాలో నియోజకవర్గాల వారీ ఏ అభ్యర్థులు గెలుస్తారోనన్న దానికోసం ఆసక్తిగా వేచి చూస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే తమకు కలిగే లబ్ధి ఏమిటన్నది అంచనా వేసుకుంటున్నారు. తిరుపతి వంటి చోట్ల అయితే ఫలితాలను బట్టి శాంతి భద్రతలు, భూ దందాలు, దౌర్జన్యాలు వంటివి అదుపులోకి వస్తాయా రావా అన్నదానిపై చర్చ నడుస్తోంది. శ్రీకాళహస్తిలో కూడా ఇవే అంశాలపై జనంలో చర్చ సాగుతోంది. చంద్రగిరిలో ఇటీవలి ఘర్షణల నేపథ్యంలో ఫలితాలను బట్టి ఏం జరుగుతుందోనన్న ఆందోళన జనంలో కనిపిస్తోంది. వెంకటగిరిలో రామ్‌కుమార్, సూళ్ళూరుపేటలో నెలవల విజయశ్రీ, చంద్రగిరిలో మోహిత్ రెడ్డి, తిరుపతిలో అభినయ్ వంటి రాజకీయ కుటుంబాల వారసుల భవితవ్యంపైనా జనంలో ఆసక్తి నెలకొంటోంది. శ్రీకాళహస్తిలో పాత ప్రత్యర్థుల్లో ఎవరు గెలుస్తారన్నదానిపైనా జనం దృష్టి సారిస్తున్నారు. వైసీపీ అధిష్ఠానంపై తిరుగుబాటు చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ తదితరుల ఫలితాల గురించి జనం ప్రత్యేకమైన ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలు చేసిన ప్రయోగాలు ఫలిస్తాయా లేక వికటిస్తాయా అన్నదానిపైనా అటు రాజకీయ వర్గాల్లోనూ ఇటు జనంలోనూ ఆసక్తి వ్యక్తమవుతోంది. వీటన్నింటి కోసం నేటి ఓట్ల లెక్కింపు ఫలితాల కోసం అన్ని వర్గాలూ ఉత్కంఠగా వేచి చూస్తున్నాయి.

ఉదయం 8 గంటలనుంచే కౌంటింగ్

● సాయంత్రం 4గంటలకల్లా పూర్తి ఫలితాలు : కలెక్టర్


కౌంటింగ్ హాళ్లలో పూర్తయిన ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఉదయం ఎనిమిది గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభించి, సాయంత్రం నాలుగు గంటలకల్లా పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు.

16 కౌంటింగ్ హాళ్లు

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు తిరుపతి పార్లమెంటుకు సంబంధించి పోలైన ఓట్లను లెక్కించడానికి 16 కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేశారు.

బరిలో 156 మంది

ఓ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 156మంది ఎన్నికల బరిలో ఉన్నారు. గూడూరుకు 14 మంది, సూళ్లూరుపేటకు తొమ్మిదిమంది, వెంకటగిరికి 10మంది, చంద్రగిరికి 24మంది, తిరుపతికి 46మంది, శ్రీకాళహస్తికి 15, సత్యవేడుకు 15మంది పోటీ చేశారు. పార్లమెంటుకు వచ్చేసరికి 23మంది బరిలో ఉన్నారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా..

ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. చంద్రగిరికి మాత్రం 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పార్లమెంటుకు కూడా ఇదే తరహాలో ఉంటాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా టేబుల్‌కో ఏఆర్వో స్థాయి అధికారిని నియమించారు. నలుగురు సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొంటారు. దాదాపు 250 టేబుళ్లకు 2వేల మంది సిబ్బంది ఉంటారు. ఉదయం ఏడు గంటలకు అబ్జర్వర్లు, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్ తెరుస్తారు. ఎనిమిది గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. 8.30 గంటలకు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల గణన ప్రారంభం కానుంది. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓట్ల లెక్కింపు చేపడతారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈవీఎంతోపాటు పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమాంతరంగా సాగుతుంది.

20 నిమిషాలకో రౌండ్ ఫలితం

● **తొలి ఫలితం సత్యవేడు.. చివరిది చంద్రగిరి**

ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక తొలి రౌండ్ మాత్రం అరగంటపాటు ఉంటుంది. తర్వాత ప్రతి 20 నిమిషాలకో రౌండ్ ఫలితం వెలువడనుంది. సత్యవేడు, తిరుపతి, చంద్రగిరి 20 రౌండ్లు చొప్పున.. వెంకటగిరి, సూళ్లూరుపేట 22రౌండ్లు, గూడూరు, శ్రీకాళహస్తి 21 రౌండ్లలో ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ లెక్కన మొదట సత్యవేడు, ఆ తర్వాత శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఫలితాలు వెల్లడవుతాయి. మధ్యాహ్నం మూడు గంటలకల్లా ఈ ఐదు నియోజవర్గాల్లో ఫలితాలు పూర్తిస్థాయిలో వెలువడనున్నాయి.తిరుపతిలో అభ్యర్థులు 46మంది బరిలో ఉండటం.. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 4,776ఓట్లు పోలైన నేపథ్యంలో కాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. చంద్రగిరికి అత్యధికంగా పోలింగ్ కేంద్రాలు ఉండటం... పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సంఖ్య 5వేలు దాటడంతో సాయంత్రం నాలుగు గంటల సమయానికి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

కీలకం కానున్న పోస్టల్‌బ్యాలెట్

ఫలితాల్లో పోస్టల్ బ్యాలెట్లు కీలకం కానున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఈసారి 90శాతం మంది ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి 23వేల ఓట్లు నమోదయ్యాయి.తిరుపతి పార్లమెంటకు వచ్చేసరికి 19,503మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మొరాయిస్తే వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కిస్తారు

ఈవీఎం కంట్రోల్ యూనిట్ల బ్యాటరీలు పనిచేయకున్నా, సాంకేతిక సమస్యలతో మొరాయించినా పక్కన పెట్టేస్తారు. ఈసీ అనుమతితో మొరాయించిన వాటికి సంబంధించిన వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కిస్తారు.

తిరుపతంతా పోలీసులమయం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 3: కౌంటింగ్ నేపథ్యంలో తిరుపతిలో ఎటుచూసినా పోలీసులు మోహరించి ఉన్నారు. సాయుధ బలగాలతోపాటు వజ్ర, ఫాల్కన్ వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 25 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ప్రతి చెక్ పోస్టు వద్ద సీఐ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనతోపాటు ఇద్దరు ఎస్‌ఐలు, 20 మంది పోలీసులు ఉంటారు. అత్యంత సమస్యాత్మక నియోకజవర్గాలుగా గుర్తించిన తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరుల్లోని దాదాపు 135 గ్రామాల్లో సాయుధ బలగాలను మోహరించారు. ఘర్షణలు జరిగితే 10, 20 నిమిషాల వ్యవధిలో ఘటనా ప్రాంతానికి చేరుకునేలా మొబైల్ పార్టీలు, కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వు బలగాలు ఎస్పీ హర్షవర్ధనరాజు ఏర్పాటు చేశారు.

22 బాంబు డిస్పోజల్ టీమ్‌లు

కౌంటింగ్ కేంద్రం బయట, లోపల 22 బాంబు డిస్పోజల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు.గేటు 2 వద్ద మూడు డోర్ ఫ్రేములు, వర్సిటీలోపల 10 డోర్ ఫ్రేములు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ నిశితంగా, క్షుణ్ణంగా తనిఖీ చేశాకే లోనికి పంపుతారు.

పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద బందోబస్తు

ప్రధాన పార్టీల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి అభ్యర్థికీ ఓ రిజర్వు సీఐ, నలుగురు పోలీసు సిబ్బందిని షాడో పార్టీలుగా నియమించారు.పార్టీ కార్యాలయాల వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు బలగాలను నియమించారు.

అల్లర్లు సృష్టిస్తే జైలుకే

అల్లర్లు సృష్టించే వారిపై రౌడీషీట్ తెరుస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే వెంటనే అరెస్టు చేసి, జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇప్పటికే దాదాపు 57 మందిపై కొత్తగా రౌడీషీట్లు ఓపెన్ చేశామని తెలిపారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు కానీ ఉల్లంఘిస్తే మాత్రం జైలుకు పంపుతామని, బెయిలు రావడం కష్టమవుతుందని చెప్పారు.

అల్లర్లు, విధ్వంసాలు జరిగితే

వాట్సాప్ నెంబరు 80999 99977కు సమాచారం ఇవ్వండి

ఎక్కడైనా అల్లర్లు, విధ్వంసాలు, గొడవలు, హింసాత్మక ఘటనలు జరిగితే వెంటనే పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సంబంధిత ప్రాంతాలకు ఆర్మ్‌డ్ బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్సు 10, 20 నిమిషాల వ్యవధిలో చేరుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటిద్దాం

వైసీపీ, టీడీపీ శ్రేణులకు చెవిరెడ్డి, నానీ సందేశం

చంద్రగిరి, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ రోజైన మంగళవారం తిరుపతి మహిళా యూనివర్శిటీ వద్ద ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి, పోలీసులకు సహకరించి, ఎన్నికల నిబంధనలు పాటిద్దామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తమతమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సందేశాన్ని సోమవారం సోషల్ మీడియా ద్వారా పంపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం చంద్రగిరి, తిరుపతిలో జరిగిన సంఘనలు దురదృష్టకరమని, మంగళవారం రోజున కౌంటింగ్ కేంద్రం వద్ద, చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగినా సహనంతో క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా ఉండాలని వారివారి పార్టీ నాయకులకు సూచించారు. చంద్రగిరి నియోజకవర్గంలో చిన్న గొడవలు జరిగినా అది చంద్రగిరికి మచ్చలాగా తయారవుతుందన్నారు. విజయోత్సవ సంబరాలు, బాణసంచా కాల్చడం వంటివి నిలిపివేయాలని వారు కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



చిన్నగొట్టిగల్లులో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న పోలీసులు

భాకరాపేట, జూన్ 3: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భాకరాపేట ఎస్ఐ విజయకుమార్ నాయక్ తెలిపారు. సోమవారం చిన్నగొట్టిగల్లులో శాంతి భద్రతలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలంలో సమస్యాత్మకమైన భాకరాపేట, జంగావాండ్లపల్లె, రంగన్నగారిగడ్డ, తిప్పిరెడ్డిగారిపల్లె గ్రామాలను పోలీసులు క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. యువత అల్లర్లకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు.

మరకతశక్తి కాళీ సేవలో ప్రముఖులు



ఐజీ లక్ష్మణ్‌నాయక్‌ను ఆశీర్వదిస్తున్న సిద్ధేశ్వరానంద భారతి

రామచంద్రాపురం, జూన్ 3: రాయలచెరువు కట్ట శ్రీశక్తి పీఠంలో వెలసిన మరకత శక్తి కాళీ అమ్మవారిని కేరళకు చెందిన ఐజీ లక్ష్మణ్‌నాయక్, సమరసత వేదిక అఖిలభారత క్షేత్రసంయోజక్ శ్యామ్‌ప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు.

కొన్నిశాఖల ఉద్యోగులకే జీతాలు

- పెన్షనర్లకు నిరాశే!

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. తొలిరోజే అందుతాయని ఆశించినవారికి నిరాశే ఎదురైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడే విషయంలో ప్రస్తుత ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు వేస్తుందని ఆశపడ్డ ప్రభుత్వ ఉద్యోగులకు ఎదురుచూపులే మిగిలాయి. గతంలో మాదిరిగానే ఎప్పుడు పడతాయో ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ, పోలీసు, వైద్య, ఆరోగ్య, న్యాయ, ఖజానాశాఖ ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడగా, మెజార్టీ ఉద్యోగులున్న శాఖలకు మాత్రం ఇంకా జీతాలు అందని పరిస్థితి. చిత్తూరు జిల్లాలో ఉన్న 12,505 మంది పెన్షనర్లకు కూడా వారి బ్యాంకు ఖాతాల్లో పెన్షన్లు జమకాలేదు. ఒకటో తేదీ నే పెన్షన్లు పడతాయని ఆశించినా... జగన్ సర్కార్ అం దుకు భిన్నంగా వ్యవహరించడంతో పెన్షనర్లు మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల జీతాల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గంజాయి విక్రేత అరెస్టు

- రూ. 50వేల విలువ చేసే మూడు కిలోల గంజాయి సీజ్



గంజాయి, నిందితుడ్ని మీడియాకు చూపిస్తున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు, జూన్ 3: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు నగరంలోని వీరభద్రకాలనీలో గంజాయి అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ఇక్బాల్, సిబ్బందితో కలిసి మంగళవారం నీవానది ఒడ్డున దాడులు నిర్వహించి షణ్ముగం(32) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 50వేల విలువ చేసే మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే మూడు కేసులు నమోదుకాగా తాజాగా రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు సీఐ తెలిపారు. గంజాయిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అభినందించారని సీఐ తెలిపారు.

బావిలో పడ్డ జింక

- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది





జింకను బావిలోనుంచి వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్‌లో) బయటపడ్డ జింక

కుప్పం, జూన్ 3: వంద అడుగుల లోతు గల ఎండిపోయిన బావిలో పడిన జింకను కుప్పం అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం గణేశ్‌పురం మలుపు వద్ద కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ ఎండిన బావిలో ఒక అడవి జింక ప్రమాదవశాత్తు పడిపోయింది. స్థానికులు కొందరు ఈ విషయం గురించి కుప్పం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిలో ఇద్దరు బావిలోకి దిగి, తాళ్ల సాయంతో జింకను వెలికి తీసి ప్రాణాలు కాపాడారు. అనంతరం జింకను అటవీ శాఖాధికారులకు అప్పగించారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



కల్లూరు, జూన్ 3: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు మామిడిచెట్లను ధ్వంసం చేసింది. దాదాపు 10 చెట్లను విరిచేసింది. సుమారు అర టన్ను మామిడికాయలు నేలరాలాయి. కోటపల్లికి చెందిన రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడి తోటలోకి ఆదివారం రాత్రి చొరబడిన ఒంటరి ఏనుగు బీభత్సం చేసింది.

అగ్రిలో డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూన్ 3: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలో నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రమణ తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో ప్రవేశాలు కల్పించే ఈ కోర్సులకు ఈనెల ఒకటో తేదీనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఇదేనెల 20వ తేదీవరకు గడువుందని చెప్పారు. ఇంటర్ ఫెయిలైనవారు కూడా దరఖాస్తు చేయవచ్చని, 2024 ఆగస్టు 31వ తేదీనాటికి 15-22 ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులని తెలిపారు. గ్రామీణ, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్‌ని సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తదితరాలకు 0877-2249909, 96181 67187 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని సూచించారు.


7న స్థల రికార్డుల పరిశీలన

మంగళం, జూన్ 3: మంగళం పరిధిలోని సప్తగిరి పంచాయతీ మంగళం గ్రామ సర్వే నెంబరు 31లోని (21ఏ) నిషేధిత జాబితాలో ఉన్న స్థలంలో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌తో నిర్మాణాలు చేపడుతున్న వారి రికార్డులను తిరుపతి అర్బన్ మండల తహసీల్దారు ఈనెల 7న పరిశీలించనున్నారని పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తహసీల్దారు నుంచి ఆదేశాలు వచ్చే వరకు నిర్మాణాలు వద్దని నోటీసుల్లో పేర్కొన్నా, సదరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నారు. పైఅధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తామన్నారు.

ఆ గదిలో ఏముంది..?

- ముక్కంటి అతిథిగృహంలో గోల్‌మాల్
- శివయ్య సొమ్ముకు శఠగోపం
- అధికారుల తీరుపై దుమారం

శ్రీకాళహస్తి, జూన్ 3: ముక్కంటి ఆలయ అధికారుల తీరుపై నిత్యం వివాదాలు చెలరేగుతూనే ఉన్నాయి. ఆలయంలోని జ్ఞానప్రసూనాంబిక అతిథిగృహంలో భక్తుల కోసం కేటాయించిన గదులను తమ సొంత అడ్డాగా ఉపయోగించుకుంటున్నారు. దీనిపై చాలా కాలంగా విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నా ఎవరూ నోరు మెదపడం లేదు. 8వ నెంబరు గది దుర్వినియోగంపై ఇటీవల పక్కా ఆధారాలతో కొందరు దేవదాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆ గదిని భక్తులకు కేటాయించక తప్పలేదు. అయితే మళ్లీ చాకచక్యంగా అధికారులు 8వ నెంబరు గది పేరుతో బిల్లులు ఇస్తూ మరో నెంబరు గదులను కేటాయిస్తూ తెలివితేటలను ప్రదర్శిస్తున్నారు. ఈ విషయం ఆధారాలతో సహా బట్టబయలైంది. శ్రీకాళహస్తీశ్వరాలయం రాహుకేతు సర్పదోష నివారణ పూజలకు అత్యంత ప్రసిద్ధి చెందడంతో దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం భక్తులు ఆలయానికి విచ్చేస్తున్నారు. భక్తులసంఖ్య అంతకంతకు పెరుగుతుండటంతో ఇక్కడ బస కొరత ఏర్పడింది. ఆలయం తరపున పలు అతిథిగృహాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. అయితే కేవలం ఒకే ఒక జ్ఞానప్రసూనాంబికసదన్ మాత్రం ఆలయ ఆవరణలో ఉంది. దీంతో ఇక్కడ గదుల కోసం విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇటీవల ఏడాది క్రితం అన్నవరం నుంచి ఓ ఇంజనీరింగ్ అధికారి శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చారు. అధికారికి ఇంటి నుంచి రాకపోకలు సాగించేందుకు దేవదాయశాఖ కారు, డ్రైవర్ వసతి కూడా కల్పించారు. ఇక జీతంతో పాటు హౌస్‌రెంట్ అలవెన్స్ కూడా రావడం మామూలే. అయితే ఆ అధికారి ప్రైవేటు ఇంటి అద్దెను ఆదా చేసుకునేందుకు కక్కుర్తి బుద్ధిని ప్రదర్శించాడు. ఆలయం లోపల ఉన్న జ్ఞానప్రసూనాంబిక అతిథిగృహంలో 8వ నెంబరు గదిని తన కోసం కేటాయించుకున్నాడు. దీనిపై ఆరు నెలల నుంచి పలుమార్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. అధికారుల తీరుపై పత్రికల్లో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ఇటీవల కొందరు 8వ గదిలో ఇంజనీరింగ్‌శాఖలోని ఓ అధికారి చేస్తున్న భాగోతంపై దేవదాయశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. లక్షల రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆలయ ప్రాంగణంలో ఉన్న అద్దె గదిలో అపవిత్రమైన చేపలు, మాంసం వంటి వంటకాలు వండుతున్నట్లు పేర్కొన్నారు. అద్దెగదుల్లో ప్రమాదకరమైన విద్యుత్ పరికరాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులో నమోదు చేశారు. దీంతో జ్ఞానప్రసూనాంబిక సదన్‌లోని 8వ నెంబరు గదిని భక్తులకు కేటాయించాలంటూ దేవదాయశాఖ నుంచి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. నాలుగు రోజులపాటు ఆదేశాలను అమలు చేయకుండా ముక్కంటి ఆలయ అధికారులు తమదైన శైలిలో దాటవేశారు. మళ్లీ దేవదాయశాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఇటీవల 8వ నెంబరును కేటాయిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో బిల్లులు నమోదు చేశారు. ఆ తరువాత అదే రసీదుపై మరో అద్దె గది నెంబరు ఇస్తూ భక్తులను బుజ్జగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఓ భక్తుడి కుటుంబానికి సీఆర్వో ఆఫీసులో 8వ నెంబరుతో గదిని కేటాయించారు. వారు అతిథిగృహం వద్దకు చేరుకున్న తరువాత అక్కడ ఉన్న ఓ అధికారి 18వ నెంబరుగా పెన్నుతో రాసి గదిని మార్చి చూపించాడు. దీనిపై భక్తులు ఎందుకు గదిని మారుస్తున్నావంటూ నిలదీశారు. గూడుపుఠాని చేస్తున్న అధికారులు రకరకాల కారణాలు చెబుతూ బుజ్జగించే ప్రయత్నం చేశారు. అసలు ఆ గదిలో ఏముంది... ఆ గదిని ఆన్‌లైన్ బిల్లుద్వారా ఎందుకు కేటాయించారు. మళ్లీ ఎందుకు అనధికారికంగా వేరే గదికి మళ్లిస్తున్నారంటూ భక్తులు ప్రశ్నించారు. దీనిపై మళ్లీ ఆలయ పరిపాలన భవనంలో భక్తుల కుటుంబం ఫిర్యాదు చేసింది. దీంతో 8వ నెంబరు గది వ్యవహారంపై సోమవారం పెద్దఎత్తున దుమారం రేగింది. ఈఅంశం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆ గదిలో ఏముంది అనే ప్రశ్న పెద్దఎత్తున సర్వత్రా చర్చకు దారి తీసింది. ఆలయానికి గండికొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



గది నెంబరు 8ని 18గా కేటాయించిన రసీదు

కూటమి గెలుపు కోసం...

ఆంజనేయుడికి కొబ్బరికాయలు కొట్టి, అంగప్రదక్షిణ చేసిన టీడీపీ శ్రేణులు

చంద్రగిరి, జూన్ 3: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి గెలుపొందాలని మండలానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు, బుచ్చినాయుడుపల్లె మాజీ సర్పంచ్ వేణు ఆధ్వర్యంలో సోమవారం శ్రీవారిమెట్టు మార్గంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆ పార్టీ శ్రేణులు 116 కొబ్బరి కాయలు కొట్టి, పొర్లు దండాలతో అంగ ప్రదక్షణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అత్యధిక సీట్లతో విజయం సాధించి, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని, చిత్తూరు ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావు అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని స్వామివారిని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మిట్టపాలెం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారాయల్, నాయకులు మబ్బు గురునాథం, మునిభాస్కర్, మబ్బు లోకేష్, సుధాకర్, శివకృష్ణ, దాము, రాజులు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారిమెట్టు మార్గంలో భక్తాంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

గాదంకి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

టెంపో ట్రావెల్‌లో మద్యం, రెండు కత్తుల స్వాధీనం - 14 మంది అరెస్ట్





పట్టుబడిన మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్ - గాదంకి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం, సామగ్రి

చంద్రగిరి, జూన్ 3: చంద్రగిరి మండలం, పనపాకం సమీపంలోని గాదంకి టోల్ ప్లాజావద్ద సోమవారం కర్నాటక నుంచి వస్తున్న టెంపో ట్రావెల్‌ను పోలీసులు తనిఖీ చేయగా, అందులో 29 మద్యం ఫుల్ బాటిళ్లు, 26 టిన్ బీర్లు, రెండు కత్తులు లభించాయి. దీంతో వాహనంలో ఉన్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో నెల్లూరు జిల్లా, కావలి సమీపంలోని కొత్తసత్రం గ్రామానికి చెందిన 13 మంది మంగళూరులోని హార్బర్‌లో చేపలు పట్టడానికి వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో అక్రమంగా మద్యం తరలిస్తున్నందున డ్రైవర్‌తోపాటు మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. అయితే సోషల్ మీడియాలో చంద్రగిరి నియోజకవర్గంలో మారణాయుధాలతో రౌడీ మూకలు తిరుగుతున్నట్లు సమాచారం వస్తుందని, ఇది పూర్తిగా అవాస్తమని, 13 మంది మత్స్యకారులని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరంలేదని, శాంతిభద్రతలు పూర్తిగా పోలీసుల అదుపులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

మామిడి కాయలకు రక్షక కవచం

అధిక ధరలతో లాభాల బాటలో రైతన్న

సోమల, జూన్ 3: మామిడి కాయలకు రక్షక కవచం తొడగడంతో మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతున్నాయి. కిలోకు రూ.22 అదనంగా పొందుతున్నారు. సోమల మండలంలో పలువురు రైతులు మామిడి తోటల్లో దిగుబడులు వచ్చిన వెంటనే కాయలు ఒక సైజుకు వచ్చినప్పుడు ఈ రక్షక కవచాలను కాయలకు కడుతున్నారు. దీంతో కాయలు కోత సమయంలో అధిక ధరలు పలుకుతున్నాయి. సోమల మార్కెట్‌లో సోమవారం బేనిషా రకం కిలో రూ. 50 పలకగా, రక్షక కవచం ఏర్పాటు చేసిన కాయలకు అదనంగా రూ.22 చెల్లించారు. దీంతో కిలో రూ. 72 పలికింది. మల్లికా రకం రూ. 65, తోతాపురి కిలో రూ. 57కు చేరుకుంది. రక్షక కవచం కట్టడంతో మామిడి కాయలకు పురుగుల బెడద లేకుండా చూసుకోవడంతో పాటు వీటికి వర్షంతో దెబ్బతినకుండా ఉంటుంది. గాలి వానలకు రాలకుండా ఉంటుంది. వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుంది. కాయలు నాణ్యతతో ఉండడం రైతులు ఉత్సాహం చూపుతున్నారు. సోమల మండలంలోని పలువురు రైతులకు పలు మామిడి సొసైటీలు సబ్సిడీ ధరలకు అందజేశారు. ఒక్కో రక్షక కవర్ రూ.1.80 కి, రూ.2 విక్రయించారు. వీటిని రైతులు తమ తోటల్లోని కాయలకు కట్టడానికి ఒక్క రూపాయి, రూ.1.50 వంతున చెల్లించారు. కోత సమయంలో వీటికి ప్రత్యేక ధర రావడంతో కవర్లు కట్టడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఉద్యానశాఖ సబ్సిడీతో అందజేస్తామని ప్రకటించినా సకాలంలో రైతులకు అందజేయలేక పోయారు. అధికారులు స్పందించి రాబోవు మామిడి సీజన్‌కు రాయితీ ధరతో రైతులకు రక్షక కవర్లు అందజేయాలని కోరుతున్నారు.



సోమల మార్కెట్‌లో రక్షక కవచం ఉన్న మామిడిని ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

గంధమనేని పారిజాతమ్మకు ప్రముఖుల నివాళి

పిచ్చాటూరు, జూన్ 3: పుత్తూరు మాజీ ఎమ్మెల్యే గంధమనేని శివయ్య సతీమణి గంధమనేని పారిజాతమ్మ అంత్యక్రియలు చెన్నై కోడంబాక్కంలోని ఎన్‌టీఆర్ స్ట్రీట్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.నారాయణ, డీసీసీబీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు గంధమనేని హరీష్‌నాయుడుతో పాటు పలువురు నాయకులు పారిజాతమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె కుమారుడు గౌతమ్, కుమార్తె విజయలక్ష్మి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం సీపీఐ నేత నారాయణ మాట్లాడుతూ గంధమనేని శివయ్య కుటుంబం తనకు, తన కుటుంబానికి సన్నిహితంగా ఉండేదన్నారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన శివయ్య ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినా, అతను, అతని కుటుంబం సాధారణ జీవితాన్ని గడిపారని కొనియాడారు. 1970వ దశకంలోనే శివయ్య వ్యవసాయంపై సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని తెలిపారు. రేణిగుంట వద్ద గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ రావడానికి శివయ్య ప్రధాన భూమిక పోషించారన్నారు. శివయ్య అభ్యున్నతికి సతీమణిగా పారిజాతమ్మ తోడ్పాటు ఎంతో ఉందన్నారు. దంపతులిద్దరూ తమ తుదిశ్వాశ వరకు వామపక్ష బావజాలాన్నే అనుసరించడం గర్వంగా ఉందన్నారు. అలాగే ఆలిండియా హ్యాండ్ లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కె.కల్యాణ్ చక్రవర్తి, ఉమ్మడి చిత్తూరు డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జి.హరీష్ నాయుడు, సీపీఐ జిల్లా నేత రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నిరాజ్, పిచ్చాటూరు మాజీ జడ్పీటీసీ సభ్యులు జి.బాలాజీనాయుడు తదితరులు పారిజాతమ్మకు నివాళులర్పించారు.



పారిజాతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు, సీపీఐ నేత నారాయణ

సీఎంఆర్ కర్మాగార యాజమాన్యంపై చర్యలు తీసుకోండి: సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్), జూన్ 3: ఏర్పేడు మండలంలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారంలో 35 మంది కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటనలో యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఈ సంఘటన జరుగకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి 35 మంది కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

పింఛన్ కోసం వెళ్లి...

వడదెబ్బతో వృద్ధుడి మృతి



కిష్టప్ప(ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, జూన్ 3: పింఛన్ కోసం వెళ్లిన వృద్ధుడు ఎండవేడిమి తాళలేక మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు... పుత్తూరు పట్టణ పరిధిలోని ఆరేటమ్మ ఎస్టీ కాలనీకి చెందిన కే.కృష్టప్ప వృద్ధాప్య పింఛన్ కోసం కల్యాణపురం సచివాలయానికి ఆదివారం వెళ్లాడు. క్యూలైన్‌లో నిలబడి ఉండగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. సచివాలయ సిబ్బంది సమాచారంతో కుటుంబసభ్యులు కిష్టప్పను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

హడావుడిగా అక్రమ నియామకాలు

ముక్కంటి ఆలయంలో మరో వివాదాస్పద చర్య

శ్రీకాళహస్తి, జూన్ 3: ముక్కంటి ఆలయంలో 21మందికి హడావుడిగా అక్రమ నియామకాలు కల్పించేందుకు కుట్రలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల కొద్ది నెలల క్రితం ముక్కంటి ఆలయంలో కొందరు ఒప్పంద ఉద్యోగులను రహస్యంగా నియమించడంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వ్యక్తమయ్యాయి. భారీగా నగదు వసూలు చేసి ఒప్పంద ఉద్యోగులను నియమించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే అదే పంథాను సోమవారం మళ్లీ ఆలయ అధికారులు అనుసరించినట్లు పెద్దఎత్తున విమర్శలు చెలరేగాయి. వైసీపీ నాయకులు, ఆలయంలోకి కొందరు అధికారులు ఇటీవల కుమ్మక్కై మరో 21మందిని నియమించేందుకు కొద్దిరోజులుగా మంతనాలు సాగించినట్లు తెలిసింది. వారి వద్ద నుంచి ముడుపులు కూడా స్వీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పటికీ వారిని ఆఘమేఘాలపై ఉద్యోగులుగా నియమించేందుకు సిద్ధమైపోయారు. తెరచాటు తతంగమంతా పూర్తి చేసుకున్నారు. 21మంది జాబితాతో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పని చేసే ఓ ఉద్యోగి ఒక ఏఈవో స్థాయి అధికారి నియామక ఫైల్‌ను సిద్ధం చేసుకున్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడేలోగా నియామకం పూర్తి చేసేందుకు పథకం వేశారు. అదే ప్రకారం ఏఈవో ఫైల్‌తో విజయవాడకు చేరుకున్నారు. ఈ గూడుపుఠాని ఒకరి నుంచి ఒకరికి పాకిపోయింది. విజయవాడలోని దేవదాయశాఖ ఉన్నతాధికారులను కోడ్ సమయంలో ఎలా నియామకాలు చేస్తారంటూ కొందరు ప్రశ్నించారు. దీంతో చివరి నిమిషంలో అక్రమ నియామకాల జాబితా బయటకు పొక్కకుండా అడ్డుకట్టపడింది.

నగరి విజేత ఎవరు?





గాలి భానుప్రకాష్, రోజా

పుత్తూరు అర్బన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో విజేతలెవరో నేడు వెల్లడికానుంది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల ఘట్టం ఆఖరి అంకానికి చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నానికి విజయం ఎవరిని వరించనుందో తేలిపోనుంది. చిత్తూరు ఎస్వీపీసెట్‌లో నగరి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. మధ్యాహ్నానికి ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా గెలుపుపై ఇరుపార్టీల అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతలు అదుపుతప్పకుండా పోలీసులు నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

మొత్తం 17 రౌండ్లు : నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 229 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1,76,399 ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. దీనికిగాను మరో 3 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమై తొలి ఫలితం 9గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం ప్రక్రియ మధ్యాహ్నానికి పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గెలుపుపై ధీమాగా పార్టీలు

గెలుపుపై టీడీపీ, వైసీపీ పార్టీలు ధీమాగా ఉన్నాయి. నగరి అసెంబ్లీ సీటు టీడీపీ కైవసం చేసుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తుండడంతో ఆ పార్టీలో నూతనోత్సాహం తొణికిసలాడుతోంది. గత రెండు ఎన్నికల్లో స్వల్ప ఓట్ల మెజార్టీతో సీటు కోల్పోయిన టీడీపీ ఈ దఫా ఎన్నికల సంగ్రామంలో హోరాహోరీగా తలపడింది.అభ్యర్థి గాలి భానుప్రకాష్‌పై ఓటర్లలో ఉన్న సానుభూతితో పాటు కూటమి పట్ల ఉన్న సానుకూలత తమను విజయతీరాలకు చేరుస్తాయని టీడీపీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలే తమను గెలుపుతీరాలకు చేరుస్తాయని వైసీపీ అంచనా వేస్తోంది. అయితే వైసీపీ అభ్యర్థి ఆర్కే రోజాపై సొంత పార్టీలో వ్యతిరేకత ఎక్కడ ముంచుతుందోనని ఆ పార్టీ నేతలు అంతర్గత చర్చల్లో సంభాషించుకుంటున్నారు. దీనికి తోడు కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్, బూత్ మేనేజ్‌మెంట్‌లో వైసీపీ చేతులెత్తేసిందనే అంచనాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు గెలుపుపై పైకి గంభీరంగా ఉన్నప్పటికీ లోలోన మాత్రం ఆందోళనతోనే ఉన్నారు. తీవ్ర ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికల్లో నగరి గడ్డపై జెండా ఎగురవేసేది ఎవరనేది మంగళవారం మధ్యాహ్నానికి తెలిసిపోనుంది.

కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ పూర్తి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ పూర్తి అయినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌వైజర్లు 297మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 369మంది, మైక్రో అబ్జర్వర్లు 330మంది మొత్తం 996మందిని కౌంటింగ్ కోసం కేటాయించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం సిబ్బందికి మూడవ ర్యాండమైజేషన్ చేసి టేబుల్‌కు కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్లు ఉజ్వల్‌కుమార్ ఘోష్, కైలాస్ వాంఖడే, జ్యోతి, జ్యోత్స్న, విద్యాసాగర్, హిరాముఖే పడియార్, ఐజీ మోహన్‌రావు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఎస్పీ విస్తృత పర్యటన

తిరుపతి (నేరవిభాగం), జూన్ 3: నగరంలో సోమవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు విస్తృతంగా పర్యటించారు. లీలామహల్ జంక్షన్, సత్యనారాయణపురం, కపిల్ తీర్థం రోడ్డు, అలిపిరి రోడ్డు జూ పార్కు రోడ్, తుమ్మలగుంట రోడ్డు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కీలక ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే అదుపులోకి తీసుకుని, ఐడీ కార్డులను పరిశీలించాలని ఆదేశించారు. గుంపులుగా కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో రౌడీషీటర్ల కదలికలపై దృష్టి పెట్టి, నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అర్ధరాత్రి సమయంలో ఎవరైనా అలజడి సృష్టిస్తే కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం


పద్మావతి మహిళా వర్సిటీలో సిద్ధమైన కౌంటింగ్ హాల్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ - భద్రత ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



పద్మావతి మహిళా వర్సిటీ వద్ద బందోబస్తు


బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ


గేటు వద్ద స్కానర్లు


వజ్ర వాహనాలు


కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే మార్గాల్లో స్కానర్లు



ఫాల్కన్ వాహనం

సకల శుభాలకు మూలం ఆంజనేయస్వామి ఉపాసన

స్వస్వరూపానందగిరి స్వామి

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సకల దేవతల ఆరాధనకు హనుమంతుడిని ఆశ్రయించడం ఒక్కటే మార్గమని, తద్వారా సకల శుభాలు చేకూరుతాయని శ్రీనివాసమంగాపురం వశిష్ఠాశ్రమ లలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి ఉద్ఘాటించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా నాదనీరాజనం వేదికపై స్వస్వరూపానందగిరి స్వామి అనుగ్రహభాషణం చేస్తూ రామ నామాన్ని ఎవరైతే జపిస్తారో వారందరినీ హనుమంతుడు అనుగ్రహిస్తారని, తులసీదాసు తదితర మహనీయుల చరిత్రను వివరించారు. ఆకాశగంగలో ఉదయం 10 గంటలకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకులు ఆచార్య రాఘవాచార్యులు హనుమంతుడి జన్మ విశేషాలు తెలిపారు. జపాలిలో ఉదయం 8 గంటలకు తిరుపతికి చెందిన ఉదయ్ భాస్కర్ బృందం హనుమాన్ చాలీసాను పఠించారు. తర్వాత ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన బృందం ఎందరో మహానుభావులు.., ఆంజనేయ జగదేక వీర.., బంటు రీతి కొలువు ఈయవయ్య రామా.., వంటి కీర్తలను ఆలపించారు. అనంతరం తిరుపతికి చెందిన ప్రసన్నలక్ష్మి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. అలాగే అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు లలిత శివజ్యోతి బృందం గాత్ర కచేరి నిర్వహించారు.

బాలాంజనేయస్వామికి పుష్పార్చన

హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుమలలోని ఆకాశగంగలో అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామికి సోమవారం ఉదయం కనకాంబరం, సింధూర వర్ణ గన్నేరి పుష్పాలతో విశేష సహస్ర నామార్చనను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు అంజనాద్రి, ఆకాశగంగ ఆంజనేయస్వామి జన్మస్థల, స్వామి వైభవం గురించి వివరించారు. అనంతరం స్వామికి పంచామృత తిరుమంజనం జరిగింది. టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'క్లబ్‌ఫుట్' శిశువులకు తక్షణ వైద్యంతో రక్షణ



క్లబ్‌ఫుట్ వ్యాధి గురించి తెలియజేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి(వైద్యం), జూన్ 3: క్లబ్‌ఫుట్(పుట్టుకతోనే వంకర కలిగిన పాదము) వ్యాధిన పడిన శిశువులకు తక్షణమే వైద్యం అందించడం వలన అంగవైకల్యం బారిన పడకుండా రక్షించవచ్చని డీఎంహెచ్‌వో శ్రీహరి తెలిపారు. ప్రపంచ క్లబ్‌ఫుట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రుయా చిన్నపిల్లల విభాగంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుతో కలిసి ఆయన సోమవారం క్లబ్‌ఫుట్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య విభాగాధిపతులు మనోహర్, సురేష్, డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ బ్యానర్ ఆవిష్కరణ

మలేరియా నిర్మూలన దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం బ్యానర్‌ను ఆవిష్కరించారు. డీపీఎంవో శ్రీనివాసులు, డీఎంవో రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏంటిది గోవిందా?

పుష్కరిణి చుట్టూ వాహనాల పార్కింగ్, అపరిశుభ్ర వాతావరణం



తిరుపతి(ఆటోనగర్), జూన్ 3: గోవిందరాజస్వామి పుష్కరిణి చుట్టూ వాహనాలు పార్కింగ్ చేసేస్తున్నారు. దీనివల్ల ఇక్కడసలు పుష్కరిణి ఉందా అన్న అనుమానం భక్తులకు కలుగుతోంది. దీనివల్ల కొంతమంది ఆకతాయిలు చేరుతున్నారు. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకూ అడ్డాగా మారిందన్న ఆరోపణలున్నాయి. పైగా పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుని, అపరిశుభ్రం వాతావరణం నెలకొంది. కేవలం బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవాల సమయాల్లో తప్ప, మిగిలిన సమయాల్లో దీన్ని టీటీడీ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇకనైనా పుష్కరిణిని, పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దడంపై టీటీడీ దృష్టి పెట్టాలని భక్తులు, నగరవాసులు కోరుతున్నారు.

జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ విజేతగా నెల్లూరు జట్టు


రన్నరప్‌గా నిలిచిన తిరుపతి జట్టు

తిరుపతి(క్రీడలు), జూన్ 3: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలగుంట క్రీడామైదానం వేదికగా జరిగిన జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరుజట్టు విజయం సాధించింది. ఈ పోటీలకు కోరమండల్ జోనల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఫుట్‌బాల్ జట్లు ప్రాతినిధ్యం వహించాయి. రౌండ్‌రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించగా, తుదిపోరులో నెల్లూరు, తిరుపతి జట్లు తలపడ్డాయి. ఇందులో విజేతగా నిలిచిన నెల్లూరు జట్టుకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ జట్టు ఈనెల 6నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. తిరుపతి జట్టు రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ హాజరై ప్రసంగిస్తూ ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకుని గొప్ప ఆటగాళ్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప, శ్రీనివాసులు, ప్రభాకర్, వినోద్, రమేష్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 83,740 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,462 మంది తలనీలాలు సమర్పించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

తిరుపతి(కల్చరల్), జూన్ 3: యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం సోమవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరై ప్రముఖ వైద్యుడు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల మాట్లాడుతూ.. పిల్లలకు ఎంతో ఉపయుక్తంగా శిబిరం ఉందని, ప్రతి ఏటా నిర్వహించాలని చెప్పారు. నెలపాటు జరిగిన ఈ శిబిరంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. వీరికి చిత్రలేఖనం, గానం, నాట్యం, చెస్, ఇంగ్లీషు, తెలుగు, గణితం, కర్రసాము వంటి అంశాల్లో నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మట్టా పురుషోత్తంరెడ్డి, టీటీడీ విశ్రాంత ఇంజనీర్ తోట వెంకటేశ్వర్లు, నిర్వాహకులు టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, మునిలక్ష్మి, చిత్రలేఖనం శిక్షకులు కిరణ్‌కుమారి, బి.అర్చన, చెస్ నిపుణుడు భాస్కర చౌదరి, అధ్యాపకుడు రవి, మిమిక్రీ కళాకారుడు విజయకుమార్, ఉపాధ్యాయుడు నెమిలేటి కిట్టన్న, మల్లారపు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


రమేష్‌నాథ్‌ని సన్మానిస్తున్న నిర్వాహకులు

పరిషత్‌కు పంపుతారనే వార్తలు వదంతులే

నటి సుమలత


కుటుంబ సభ్యులతో సుమలత

తిరుమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): తనను బీజేపీ పరిషత్‌కు పంపాలని చూస్తుందనే వార్తలు వదంతులు మాత్రమేనని నటి సుమలత వివరణ ఇచ్చారు. ఆ సీటు వేరే వాళ్లకు కూడా ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం తాను స్టేట్ పాలిటిక్స్ వైపు చూడటం లేదన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సీటు ఆశిస్తున్నారా అనే ప్రశ్నకు చూద్దామని బదులిచ్చారు. ఖచ్చితంగా కేంద్రంలో బీజేపీనే వస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, మోదీ 0.3ని చూస్తామన్నారు. తన కుమారుడు హీరో అభిషేక్ అంబరీష్, కోడలు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సుమలతతోపాటు నిర్మాత రాక్‌లైన్ వెంకటేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

సీజీఎంకు అభినందనలు



తిరుపతి(ఆటోనగర్), జూన్ 3: సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఓ అండ్ ఎం విభాగం సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.పద్మజను పలువురు అధికారులు కలసి అభినందనలు తెలిపారు. ఓ అండ్ ఎం విభాగం సీజీఎంగా ఉన్న గురవయ్య పదవీ విరమణ చేయడంతో, ఆస్థానంలో మీటర్ల తనిఖీ విభాగం జీఎంగా ఉన్న పద్మజకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీచేశారు. అభినందనలు తెలిపిన వారిలో ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాసులు, డీఈఈ జయప్రకాష్ ఉన్నారు.

రైల్వేస్టేషన్ ముందు ట్రాఫిక్ రద్దీ

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



తిరుపతి అర్బన్, జూన్ 3: రైల్వేస్టేషన్ ముందు ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం వేళల్లో తిరుపతి రైల్వేస్టేషన్‌కు అధిక సంఖ్యలో రైళ్లు వస్తుంటాయి. అదే తరహాలో ప్రయాణికులు కూడా దిగుతుంటారు. రైల్వేస్టేషన్ ముందు భాగం, పరిసర ప్రాంతాలు తెల్లవారుజామున నాలుగు నుంచి ఉదయం 10గంటల వరకు రద్దీగా ఉంటాయి. దీన్ని అదనుగా భావించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రైవేటు వాహనాలు వందకుపైగా రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే నిలిపేస్తారు. దీంతో ఆర్టీసీ బస్సులు, టీటీడీ ఉచిత బస్సులు, ఇతర వాహన చోదకులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


మనీష్ కుమార్ షా

తిరుమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్‌రెడ్డి, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ మనీష్ కుమార్ షా, సినీ నిర్మాత వంశీ కారుమంచి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడు

ఎంపీ రేణుకా చౌదరి



తిరుమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఏపీకి మంచిరోజులు వస్తున్నాయని, రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడని ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 2000 నుంచి ఎగ్జిట్‌పోల్స్ ఎన్నిసార్లు తప్పులు చెప్పాయో అందరూ గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్‌కి చెందిన వారంగా, దేశప్రగతి కోసం సేవ చేస్తున్నామన్నారు. దేశ ప్రజలందరూ బాగుండాలని, ముఖ్యంగా రైతులకు మంచి పంటలు పండి ఆరోగ్యంగా, ధైర్యంగా ఉండేలా స్వామి దీవిస్తారని ఆశిస్తున్నానన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

తిరుపతి(లీగల్), జూన్ 3: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరగా పరిష్కరించవచ్చని 10వ అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు తెలిపారు. తిరుపతి కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపిచంద్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మీడియేషన్ అనే అంశంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఇరుపార్టీల కక్షిదారులతో న్యాయవాదులు చర్చించి కేసులను రాజీచేయడం ద్వారా ఖర్చు ఆదా అవుతోందని తెలిపారు. మీడియేషన్‌పై కర్ణాటక ట్రైనర్ ఎస్.సుశీల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. న్యాయవాదులు నెల్లూరు యోగానంద్, నారాయణ, కందారపు సుబ్రహ్మణ్యం, దేవరాజులు, ఎస్.సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ లూజు బస్తా ధర రూ.8వేలు



గూడూరు అర్బన్, జూన్ 3: గూడూరు నిమ్మ మార్కెట్‌లో సోమవారం నిమ్మ ధర అదరకొట్టింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. దీంతోపాటు బుధవారం నాడు సాధారణ సెలవు. ఈక్రమంలో రెండు రోజులు మార్కెట్ మూతపడనుండడంతో ధరలకు రెక్కలొచ్చాయి. నిమ్మకాయలు కిలో గరిష్ఠంగా రూ.100 తాకింది. ఈశాన్య రుతుపవనాల ప్రవేశంలో నిమ్మధరలు తగ్గుముఖం పడతాయన్న క్రమంలో వరసగా రెండు రోజుల సెలవుల పుణ్యమా అని సోమవారం నిమ్మకాయల ధరలకు ఊపిరిలూదింది. దీంతో నిమ్మ రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పాశిం జన్మదినం



గూడూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 3: మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయలో సోమవారం నాయకులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో టీడీపీ బలోపేతానికి సునీల్‌కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. గతంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎన్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, వి.శివకుమార్, డి.రాఘవరెడ్డి, నరసింహులు, శ్రీధర్, జి.లీలావతి, భారతి, కల్పన, కోటేశ్వరరావు, రమణయ్య, జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం జన్మదిన వేడుకలు సోమవారం చిట్టమూరులో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఎం.జనార్దనరెడ్డి, బి.హరికృష్ణారెడ్డి, ఎన్.రాజేష్ రెడ్డి, పి.శ్రీనివాసులు, కస్తూరయ్య, చిన్నారావు, చెంచురామయ్య ఆచారి, ముత్తు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... రాములోరి కల్యాణం



భక్తులకు తాళిబొట్టు చూపుతున్న వేదపండితులు

కోట, జూన్ 3: మండలంలోని గూడలి అరుంధతీయవాడలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బలరామిరెడ్డి, రుక్మిణమ్మ దంపతులు ఉభయకర్తలుగా గ్రామస్తుల సహకారంతో కల్యాణతంతు నిర్వహించారు. మొదట శ్రీరాముడు, సీతమ్మ శాంతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. వేదపండితుడు అనంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని కళ్లకుకట్టినట్లుగా చేసి చూపించారు. గ్రామస్తులు స్వామిఅమ్మవార్లకు తలంబ్రాలను పోటాపోటీగా చల్లారు. అనంతరం అంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాగార్జున, బుల్లయ్య, రాజనాల, రాఘవులు, వాసయ్య, మురళీ తదితరులు ఉన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు



కోట, జూన్ 3: పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో సోమవారం మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని సెబ్ అధికారులు అరెస్టు చేశారు. బజారుసెంటర్‌లో డ్రైడే ఉన్నప్పటికీ మద్యం విక్రయిస్తున్న గుర్రం పెంచలయ్య, ఈదూరు వెంకట కృష్ణయ్యను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వాకాడు సెబ్ అధికారులు తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

తిరుపతి(లీగల్), జూన్ 3: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరగా పరిష్కరించవచ్చని 10వ అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు తెలిపారు. తిరుపతి కోర్టు ప్రాంగనంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపిచంద్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కక్షిదారులతో న్యాయవాదులు చర్చించి కేసులను రాజీ చేస్తే సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. మీడియేషన్‌పై కర్ణాటక ట్రైనర్ ఎస్.సుశీల ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నెల్లూరు యోగానంద్, నారాయణ, కందారపు సుబ్రహ్మణ్యం, దేవరాజులు, ఎన్.సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఎస్పీ విస్తృత పర్యటన

తిరుపతి (నేరవిభాగం), జూన్ 3: నగరంలో సోమవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజు విస్తృతంగా పర్యటించారు. లీలామహల్ జంక్షన్, సత్యనారాయణపురం, కపిల్ తీర్థం రోడ్డు, అలిపిరి రోడ్డు జూ పార్కు రోడ్, తుమ్మలగుంట రోడ్డు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కీలక ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే అదుపులోకి తీసుకుని, ఐడీ కార్డులను పరిశీలించాలని ఆదేశించారు. గుంపులుగా కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి పెట్టి, నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అర్ధరాత్రి సమయంలో ఎవరైనా అలజడి సృష్టిస్తే కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

సకల శుభాలకు మూలం ఆంజనేయుడి ఉపాసన

స్వస్వరూపానందగిరి స్వామి

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సకల దేవతల ఆరాధనకు హనుమంతుడిని ఆశ్రయించడం ఒక్కటే మార్గమని, తద్వారా సకల శుభాలు చేకూరుతాయని శ్రీనివాసమంగాపురం వశిష్ఠాశ్రమ లలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి ఉద్ఘాటించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా నాదనీరాజనం వేదికపై స్వస్వరూపానందగిరి స్వామి అనుగ్రహభాషణం చేస్తూ రామ నామాన్ని ఎవరైతే జపిస్తారో వారందరినీ హనుమంతుడు అనుగ్రహిస్తారని, తులసీదాసు తదితర మహనీయుల చరిత్రను వివరించారు. ఆకాశగంగలో ఉదయం 10 గంటలకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకులు ఆచార్య రాఘవాచార్యులు హనుమంతుడి జన్మ విశేషాలు తెలిపారు. జపాలిలో ఉదయం 8 గంటలకు తిరుపతికి చెందిన ఉదయ్ భాస్కర్ బృందం హనుమాన్ చాలీసాను పఠించారు. తర్వాత ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన బృందం ఎందరో మహానుభావులు.., అంజనేయ జగదేక వీర.., బంటు రీతి కొలువు ఈయవయ్య రామా.., వంటి కీర్తలను ఆలపించారు.

మద్యానికి మినహాయింపా...?

టార్గెట్ పూర్తయ్యేవరకు షాపులు తెరచి ఉంచాలన్న ఆదేశాలు

తడ, జూన్ 3: కౌంటింగ్ వేళ అన్ని ముందస్తు చర్యలు తీసుకున్న ఎన్నికల కమిషన్ మద్యం విక్రయాలపే గాలి కొదిలేసింది. కౌంటింగ్‌కు కొన్ని గంటల ముందు వరకు విచ్చలవిడిగా విక్రయిస్తున్నా చర్యలు తీసుకోలేకపోయింది. వాస్తవంగా పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం షాపులను మూసివేస్తారు. అలాగే కౌంటింగ్‌కు 24 గంటల ముందు మూసివేసి తరువాతి రోజు తిరిగి షాపులను తెరుస్తారు. అయితే ఈ దఫా పోలింగ్‌కు 48 గంటలకు ముందు షాపులను మూసివేసిన అధికారులు కౌంటింగ్ వచ్చేసరికి ముందురోజు విచ్చలవిడిగా అమ్మకాలు సాగించారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు షాపులన్నీ మందుబాబులతో కిటకిటలాడాయి. వాస్తవంగా ఎన్నికల కమిషన్ మద్యం విక్రయాలపై కఠినమైన నిబంధనలను అమలు చేస్తుంది. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షించి మద్యం తాగలేదని నిర్ధారించుకున్నాకే కేంద్రాల్లోకి అనుమతించే నిబంధన పెట్టింది. అయితే ముందురోజు రాత్రి మద్యం తాగి ఉన్నా బ్రీత్ ఎనలైజర్ ద్వారా నిర్ధారణ అవుతుంది. తద్వారా అతను కౌంటింగ్ ఏజెంట్‌గా ఉండేందుకు అనర్హుడవుతాడు. ఇప్పటికే పలుచోట్ల పోలింగ్ తరువాత హింసాత్మక ఘటనలు జరిగాయి. ఆదివారం సైతం సూళ్లూరుపేటలో కొందరు పార్టీ కార్యకర్తల మధ్య కొట్లాట జరిగింది. ఈ తరుణంలో మద్యం షాపులు ఇలా తెరచి ఉండటం శాంతి భద్రతల సమస్యేకదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. మద్యం షాపులను సోమవారం సాయంత్రం వరకు నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది.



సూళ్లూరుపేటలో మద్యం దుకాణం వద్ద రద్దీ

టార్గెట్ పూర్తయ్యే వరకు...

ఇలా మద్యంషాపులు తెరచి ఉంచడంపై ఓజిలి మద్యం డిపో ఎస్‌ఐ తిరుమలేష్‌రావును వివరణ కోరగా తమకు ఇచ్చిన టార్గెట్ పూర్తికాలేదని, అది పూర్తైన వెంటనే షాపులు మూసివేయాలన్న ఆదేశాలు ఉన్నాయని ఆయన అన్నారు. తద్వారా సాయంత్రం వరకు ఆ షాపులు తెరుచుకునేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు.

తిరుపతికి తరలి వెళ్లిన నాయకులు

● కౌంటింగ్‌తో ఉత్కంఠ

గూడూరు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తిరుపతిలోని పద్మావతి వర్సిటీ ఆవరణలో మంగళవారం ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరగనుండడంతో పట్టణంలోని ప్రధాన పార్టీల నాయకులు సోమవారం వాహనాల్లో తిరుపతికి తరలివెళ్లారు. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న మంగళవారం ఫలితాలను వెల్లడించనున్నారు. ఇప్పటికే ఎన్నికలు జరిగిన నాటి నుంచి ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఫలితాల కోసం ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. గూడూరు నియోజకవర్గానికి సంబంధించి 294 పోలింగ్‌బూత్‌లు ఉండగా, రౌండ్‌కు 14 టేబుళ్ల లెక్కన 21 రౌండ్లు లెక్కించనున్నారు. కౌటింగ్‌లో పాల్గొనే వివిధ పార్టీల ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముందుగానే తిరుపతికి బయలుదేరి వెళ్లారు. సర్వేల ఆధారంగా ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గెలుపుపై ఎవరు ధీమాలో వారు ఉన్నారు. మంగళవారం విజయం ఎవరిని వరిస్తుందో తేలిపోనుంది.

చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు...

చిల్లకూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం కౌటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని గుంపులుగా ఉండకూడదన్నారు. బాణసంచా పేల్చడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగులు పెట్ట కూడదన్నారు.

పెళ్లకూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై మండలంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేడు తేలనున్న ఫలితాల కోసం ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. మండలంలో 36 పోలింగ్ బూత్‌లలో 27,070 ఓట్లకు గాను 21,197 పోలైనాయి. మండలంలో 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీకి 1,980 ఓట్ల ఆధిక్యం రాగా, 2019లో ఎన్నికల్లో వైసీపీకి 8,676 ఓట్ల మెజార్టీ వచ్చింది.

టీడీపీ అభ్యర్థికి భద్రత పెంపు



కురుగొండ్ల రామకృష్ణను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

వెంకటగిరి, జూన్ 3: వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణకు పోలీసు భద్రతను పెంచారు. సోమవారం ఆయన ఇంటివద్ద పది మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. కాగా కురుగొండ్ల రామకృష్ణ సోమవారం ఉదయం పెంచలకోన నృసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆయన తిరుపతికి బయలుదేరి వెళ్లారు. మంగళవారం కౌటింగ్ ప్రక్రియలో పాల్గొంటారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి, జూన్ 3: కౌటింగ్ సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. సోమవారం ఆమె తన నివాసంలో కౌటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. కౌటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె వారికి దిశానిర్దేశం చేశారు. కౌటింగ్ ఏజెంట్లు మంగళవారం ఉదయం 5.30 గంటలకల్లా హాల్‌లోకి ప్రవేశించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డును విధిగా తీసుకుని వెళ్లాలన్నారు. కౌటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రం వదిలిపెట్టి బయటకు రావద్దన్నారు. పూర్తి స్థాయి ఫలితాలు వెలువడే వరకు అశ్రద్ధ వహించవద్దని ఆమె సూచించారు. కౌటింగ్ పూర్తయ్యే వరకు ఏజెంట్లు కేంద్రంలోనే ఉండాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పి.రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద నాయుడు, నాయకులు గంగాధర్, ఏ.సత్యనారాయణ, జి.మురళీ, పి.విశ్వనాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తున్న లక్ష్మీసాయిప్రియ

6న సూళ్లూరుపేటలో జాబ్‌మేళా

సూళ్లూరుపేట, జూన్ 3: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జేకేసీ, అవంతి లెదర్ పరిశ్రమల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. బీఎస్సీ, బీకాం పూర్తి చేసిన యువతి, యువకులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద పడవ దహనం



కాలి బూడిదైన పడవ

తడ, జూన్ 3: తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న పడవను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. తుఫాన్ అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునే నిమిత్తం అధికారులు ఎనిదేళ్ల క్రితం ఫైబర్ పడవను కొనుగోలు తహసీల్దారు కార్యాలయం వద్ద ఉంచారు. అయితే ఆదివారం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆ పడవకు నిప్పు పెట్టినట్లుగా తెలుస్తోంది. దీంతో ఆ పడవ పూర్తిగా దహనమైంది. విషయం తెలుసుకున్న తహసీల్దారు ఇక్బాల్ ప్రమాదాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తడలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తి ఈ పడవకు నిప్పు అంటించి ఉంటాడని కొందరు భావిస్తున్నారు.

క్లబ్‌ఫుట్ శిశువులకు తక్షణ వైద్యంతో రక్షణ

తిరుపతి(వైద్యం), జూన్ 3: పుట్టుకతో వంకర కలిగిన పాదం(క్లబ్‌ఫుట్) వ్యాధిన పడిన శిశువులకు తక్షణమే వైద్యం అందించడం వలన వైకల్యం బారిన పడకుండా రక్షించవచ్చని డీఎంహెచ్‌వో శ్రీహరి తెలిపారు. ప్రపంచ క్లబ్‌ఫుట్ దినం సందర్భంగా రుయా చిన్నపిల్లల విభాగంలో సూపరింటెండెంట్ రవిప్రభుతో కలిసి ఆయన సోమవారం క్లబ్‌ఫుట్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్లబ్‌ఫుట్ పుట్టుకతోనే వచ్చే వ్యాధి అని, దీనిబారిన పడిన శిశువుల పాదాలు మెలితిప్పి ఉండటంతో నడవడం కష్టతరంగా మారుతుందన్నారు. పుట్టిన వెంటనే చిన్నారులకు వైద్యం అందిస్తే అంగవైకల్యం బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు మనోహర్, సురేష్, డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడు

రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి



తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీకి మంచిరోజులు వస్తున్నాయని, రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడని రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ 2000 నుంచి ఎగ్జిట్‌పోల్స్ ఎన్నిసార్లు తప్పులు చెప్పాయో అందరూ గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన వారంగా తాము ద్వేషాలు తొలగించి దేశప్రగతి కోసం సేవ చేస్తున్నామన్నారు. దేశ ప్రజలందరూ బాగుండాలని, ముఖ్యంగా రైతులకు మంచి పంటలు పండి ఆరోగ్యంగా, ధైర్యంగా ఉండేలా స్వామి దీవిస్తారని ఆశిస్తున్నానన్నారు.

పరిషత్‌కు పంపుతారనే వార్తలు వదంతులే

● నటి సుమలత



కుటుంబ సభ్యులతో సుమలత

తిరుమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): తనను బీజేపీ పరిషత్‌కు పంపాలని చూస్తుందనే వార్తలు వదంతులేనని నటి సుమలత వివరణ ఇచ్చారు. ఆ సీటు వేరే వాళ్లకు కూడా ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం తాను స్టేట్ పాలిటిక్స్ వైపు చూడటం లేదన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సీటు ఆశిస్తున్నారా అనే ప్రశ్నకు చూద్దామని బదులిచ్చారు. కేంద్రంలో బీజేపీనే వస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. మోదీ 0.3ని చూస్తామన్నారు. తన కుమారుడు హీరో అభిషేక్ అంబరీష్, కోడలు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

చల్లబడిన వాతావరణం

గూడూరు అర్బన్, జూన్ 4: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో పట్టణంలో సోమవారం వాతావరణం చల్లబడింది. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల వరకు నమోదు కావడంతో సూర్యప్రతాపానికి ప్రజలు అల్లాడిపోయారు. ఉక్కపోతను తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రుతుపవనాలు కారణంగా వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

బాలికపై అత్యాచారయత్నం

గూడూరు అర్బన్, జూన్ 3: గూడూరులో ఓ బాలికపై పట్టణానికే చెందిన ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు... బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో యువకుడు అత్యాచారానికి ప్రయత్నించడంతో బిగ్గరగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు ఆ యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు.

అగ్రిలో డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూన్ 3: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలో నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రమణ తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో ప్రవేశాలు కల్పించే ఈ కోర్సులకు ఈనెల ఒకటో తేదీనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఇదేనెల 20వ తేదీవరకు గడువుందని చెప్పారు. ఇంటర్ ఫెయిలైన వారు కూడా దరఖాస్తు చేయవచ్చని, 2024 ఆగస్టు 31వ తేదీనాటికి 15-22 ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులని తెలిపారు. గ్రామీణ, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ని సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తదితరాలకు 0877-2249909, 96181 67187 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని సూచించారు.

ఏమిటిది గోవిందా?

పుష్కరిణి చుట్టూ వాహనాల పార్కింగ్, అపరిశుభ్ర వాతావరణం



తిరుపతి(ఆటోనగర్), జూన్ 3: గోవిందరాజస్వామి పుష్కరిణి చుట్టూ వాహనాలు పార్కింగ్ చేసేస్తున్నారు. దీనివల్ల ఇక్కడసలు పుష్కరిణి ఉందా అన్న అనుమానం భక్తులకు కలుగుతోంది. దీనివల్ల కొంతమంది ఆకతాయిలు చేరుతున్నారు. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకూ అడ్డాగా మారిందన్న ఆరోపణలున్నాయి. పైగా పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుని, అపరిశుభ్రం వాతావరణం నెలకొంది. కేవలం బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవాల సమయాల్లో తప్ప, మిగిలిన సమయాల్లో దీన్ని టీటీడీ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇకనైనా పుష్కరిణిని, పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దడంపై టీటీడీ దృష్టి పెట్టాలని భక్తులు, నగరవాసులు కోరుతున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 83,740 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,462 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్‌రెడ్డి, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ మనీష్ కుమార్ షా, సినీ నిర్మాత వంశీ కారుమంచి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



మనీష్ కుమార్ షా తదితరులు

రైల్వేస్టేషన్ ముందు ట్రాఫిక్ రద్దీ

తిరుపతి అర్బన్, జూన్ 3: రైల్వేస్టేషన్ ముందు ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం వేళల్లో తిరుపతి రైల్వేస్టేషన్‌కు అధిక సంఖ్యలో రైళ్లు వస్తుంటాయి. అదే తరహాలో ప్రయాణికులు కూడా దిగుతుంటారు. రైల్వేస్టేషన్ ముందు భాగం, పరిసర ప్రాంతాలు తెల్లవారుజామున నాలుగు నుంచి ఉదయం 10గంటల వరకు రద్దీగా ఉంటాయి. దీన్ని అదనుగా భావించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రైవేటు వాహనాలు వందకుపైగా రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే నిలిపేస్తారు. దీంతో ఆర్టీసీ బస్సులు, టీటీడీ ఉచిత బస్సులు, ఇతర వాహన చోదకులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ట్రాఫిక్ రద్దీ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ పూర్తి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ పూర్తి అయినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌వైజర్లు 297మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 369మంది, మైక్రో అబ్జర్వర్లు 330మంది మొత్తం 996మందిని కౌంటింగ్ కోసం కేటాయించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం సిబ్బందికి మూడవ ర్యాండమైజేషన్ చేసి టేబుల్‌కు కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్లు ఉజ్వల్‌కుమార్ ఘోష్, కైలాస్ వాంఖడే, జ్యోతి, జ్యోత్స్న, విద్యాసాగర్, హిరాముఖే పడియార్, ఐజీ మోహన్‌రావు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ కర్మాగారం యాజమాన్యంపై

చర్యలు తీసుకోండి: సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్), జూన్ 3: ఏర్పేడు మండలంలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారంలో 35 మంది కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటనలో యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటన జరుగకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి 35 మంది కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భక్తులతో కిటకిటలాడిన ముక్కంటి ఆలయం


రాహుకేతు మండపం వద్ద భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 3: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి, వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 32వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శన టిక్కెట్ల ద్వారా 2,467మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,624మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,902మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,162, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 321మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 209మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 52మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,018 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

హడావుడిగా అక్రమ నియామకాలు

ముక్కంటి ఆలయంలో మరో వివాదాస్పద చర్య

శ్రీకాళహస్తి, జూన్ 3: ముక్కంటి ఆలయంలో 21మందికి హడావుడిగా అక్రమ నియామకాలు కల్పించేందుకు కుట్రలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల కొద్ది నెలల క్రితం ముక్కంటి ఆలయంలో కొందరు ఒప్పంద ఉద్యోగులను రహస్యంగా నియమించడంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వ్యక్తమయ్యాయి. భారీగా నగదు వసూలు చేసి ఒప్పంద ఉద్యోగులను నియమించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే అదే పంథాను సోమవారం మళ్లీ ఆలయ అధికారులు అనుసరించినట్లు పెద్దఎత్తున విమర్శలు చెలరేగాయి. వైసీపీ నాయకులు, ఆలయంలోకి కొందరు అధికారులు ఇటీవల కుమ్మక్కై మరో 21మందిని నియమించేందుకు కొద్దిరోజులుగా మంతనాలు సాగించినట్లు తెలిసింది. వారి వద్ద నుంచి ముడుపులు కూడా స్వీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పటికీ వారిని ఆఘమేఘాలపై ఉద్యోగులుగా నియమించేందుకు సిద్ధమైపోయారు. తెరచాటు తతంగమంతా పూర్తి చేసుకున్నారు. 21మంది జాబితాతో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పని చేసే ఓ ఉద్యోగి ఒక ఏఈవో స్థాయి అధికారి నియామక ఫైల్‌ను సిద్ధం చేసుకున్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడేలోగా నియామకం పూర్తి చేసేందుకు పథకం వేశారు. అదే ప్రకారం ఏఈవో ఫైల్‌తో విజయవాడకు చేరుకున్నారు. ఈ గూడుపుఠాని ఒకరి నుంచి ఒకరికి పాకిపోయింది. విజయవాడలోని దేవదాయశాఖ ఉన్నతాధికారులను కోడ్ సమయంలో ఎలా నియామకాలు చేస్తారంటూ కొందరు ప్రశ్నించారు. దీంతో చివరి నిమిషంలో అక్రమ నియామకాల జాబితా బయటకు పొక్కకుండా అడ్డుకట్టపడింది.

ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం: డీఎస్పీ

శ్రీకాళహస్తి, జూన్ 2: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం నిషేధమని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్, 144సెక్షన్, పోలీస్‌యాక్ట్ 30 అమల్లో ఉందన్నారు. నలుగురికి మించి గుమికూడి ఉండరాదని చెప్పారు. అదే విధంగా పార్టీ కార్యాలయాలు, ఫంక్షన్‌హాల్స్ వద్ద ఎల్‌ఈడీ స్ర్కీన్స్ ఏర్పాటు చేసి జనసమీకరణ చేయడం నిషేధమని తెలిపారు. వాట్సాప్, ఇతర గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదన్నారు. అభ్యర్థుల గెలుపు అవకాశాలపై వాదనలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వ్యవసాయ విద్యుత్ స్టార్టర్ల చోరీ

శ్రీకాళహస్తి, జూన్ 3: శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లి వద్ద వ్యవసాయ భూముల్లో సోమవారం ఒకేరోజున 15 విద్యుత్ స్టార్టర్ల చోరీ జరిగింది. పట్టణానికి చెందిన న్యాయవాది ప్రసాద్‌నాయుడుకు చెర్లోపల్లిలో వ్యవసాయ భూములు ఉన్నాయి. సోమవారం ఆయన పొలంలోని మూడు విద్యుత్ మోటార్లకు సంబంధించిన స్టార్టర్లను చోరీ చేసినట్లు గుర్తించారు. పక్కనే ఉన్న మరో 12మంది రైతుల మోటార్లకు అనుసంధానమైన విద్యుత్ స్టార్టర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

చిన్నపాండూరు పీహెచ్‌సీకి ప్రహరీ నిర్మాణం

వరదయ్యపాళెం, జూన్ 3: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హీరో మోటార్స్ పరిశ్రమ యాజమాన్యం రూ.14లక్షల వ్యయంతో 190 మీటర్ల మేర ప్రహరీ నిర్మించింది. సోమవారం శిలాఫలకం ఆవిష్కరించి ప్రహరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ హీరో పరిశ్రమ యాజమాన్యం ఆస్పత్రి ప్రహరీ నిర్మాణానికి సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు నిహల్‌కౌల్, మనోహర చక్రవర్తి, అనుప్‌గుప్తా, కిరణ్, ఆశీష్‌కుమార్, హర్షవర్ధన్, వైద్యాధికారులు లావణ్య, అనిత, గణాంక అధికారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులందరూ పాఠశాలలో చేరాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 3: గిరిజన విద్యార్థులందరూ పాఠశాలలో చేరాలని ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని వేణుగోపాలపురం, కారణి గ్రామాల్లో సోమవారం ఉపాధ్యాయులతో కలసి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, యూనిఫాం, నాణ్యమైన భోజనంతో పాటుగా పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

దివ్యాంగులకు భరోసా భవిత కేంద్రాలు

శ్రీకాళహస్తి, జూన్ 3: దివ్యాంగులకు భవితకేంద్రాలు భరోసా ఇస్తాయని ఐ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం తొట్టంబేడు మండలంలోని చిలకావారికండ్రిగలో ఉన్న ఐఈఆర్టీలు నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ద్వారానే విద్యనభ్యసించే విధంగా బోధిస్తూ, వారిలో ప్రత్యేక సామర్థ్యాన్ని బయటకు తీసుకువచ్చి సాధారణ పిల్లల వలే వారిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. భవిత కేంద్రంలో ఫిజియో థెరపీ చేయడంతో పాటు వారికి అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఐఈఆర్టీలు చైతన్య, నాగరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల సర్వే వేగవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 3: మండల కేంద్రంలోని ప్రత్యేక ప్రతిభవంతుల కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష విద్యా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రత్యేక ప్రతిభవంతుల సర్వే వేగవంతం చేసి భవిత పాఠశాలలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూన్ 3: చెన్నైకు చెందిన అబాకస్ మెంటల్ ఆర్థమెటిక్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 19న 24వ అంతర్జాతీయ ఆన్‌లైన్ అబాకస్ పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన లిటిల్ మాస్టర్స్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు తనీష్, తేజస్వి, సాయిపూజిత, జశ్వంత్ మొదటి లెవల్, భావగ్న, గురుసాత్విక, నందకుమార్ రెండవ లెవల్, యువల్ ప్రీతం 4వ లెవల్, భానుమూర్తి 7లెవల్‌గా నిలిచి తమ ప్రతిభ చాటారు. వీరికి సోమవారం జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ దివ్య, చైర్‌పర్సన్ మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 3: డెంగ్యూ, మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దివాకర్ అన్నారు. మండలంలోని ఆలత్తూరు గ్రామంలో జ్వరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపండి

ఏర్పేడు, జూన్ 3: ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు గ్రామంలో సోమవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి సర్పంచు మోహనప్రియ హరిజనవాడ, గిరిజన కాలనీలో పర్యటించారు. బడి ఈడు పిల్లలు ఉన్న ఇళ్లకె వెళ్లి పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, ప్రధానోపాధ్యాయురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

జనావాసంలోకి చుక్కల దుప్పి



శ్రీకాళహస్తి, జూన్ 3: జనావాసంలోకి చుక్కల దుప్పి ప్రవేశించిన ఘటన సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ వద్ద చోటు చేసుకుంది. కాలనీ ప్రాంతంలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద చుక్కల దుప్పి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. అక్కడే నివాసం ఉండే ముక్కంటి ఆలయంలో పనిచేస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ ఉద్యోగి దాము సిబ్బందితో అక్కడికి చేరుకుని ముళ్లపొదల్లో ఉన్న చుక్కల దుప్పిని వల వేసి అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోకి తీసుకెళ్లి మన్నవరం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

కేవీబీపురం, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ షరీఫ్ చెప్పారు. గెలుపు ఓటములు సహజమని, ఫలితాలు ప్రకటించాక ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు.

ఆ గదిలో ఏముంది..?

- ముక్కంటి అతిథిగృహంలో గోల్‌మాల్
- శివయ్య సొమ్ముకు శఠగోపం
- అధికారుల తీరుపై దుమారం

శ్రీకాళహస్తి, జూన్ 3: ముక్కంటి ఆలయ అధికారుల తీరుపై నిత్యం వివాదాలు చెలరేగుతూనే ఉన్నాయి. ఆలయంలోని జ్ఞానప్రసూనాంబిక అతిథి గృహంలో భక్తుల కోసం కేటాయించిన గదులను తమ సొంత అడ్డాగా ఉపయోగించుకుంటున్నారు. దీనిపై చాలా కాలంగా విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నా ఎవరూ నోరు మెదపడం లేదు. 8వ నెంబరు గది దుర్వినియోగంపై ఇటీవల పక్కా ఆధారాలతో కొందరు దేవదాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆ గదిని భక్తులకు కేటాయించక తప్పలేదు. అయితే మళ్లీ చాకచక్యంగా అధికారులు 8వ నెంబరు గది పేరుతో బిల్లులు ఇస్తూ మరో నెంబరు గదులను కేటాయిస్తూ తెలివితేటలను ప్రదర్శిస్తున్నారు. ఈ విషయం ఆధారాలతో సహా బట్టబయలైంది. శ్రీకాళహస్తీశ్వరాలయం రాహుకేతు సర్పదోష నివారణ పూజలకు అత్యంత ప్రసిద్ధి చెందడంతో దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం భక్తులు ఆలయానికి విచ్చేస్తున్నారు. భక్తులసంఖ్య అంతకంతకు పెరుగుతుండటంతో ఇక్కడ బస కొరత ఏర్పడింది. ఆలయం తరఫున పలు అతిథిగృహాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. అయితే కేవలం ఒకే ఒక జ్ఞానప్రసూనాంబికసదన్ మాత్రం ఆలయ ఆవరణలో ఉంది. దీంతో ఇక్కడ గదుల కోసం విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇటీవల ఏడాది క్రితం అన్నవరం నుంచి ఓ ఇంజనీరింగ్ అధికారి శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చారు. అధికారికి ఇంటి నుంచి రాకపోకలు సాగించేందుకు దేవదాయశాఖ కారు, డ్రైవర్ వసతి కూడా కల్పించారు. ఇక జీతంతో పాటు హౌస్‌రెంట్ అలవెన్స్ కూడా రావడం మామూలే. అయితే ఆ అధికారి ప్రైవేటు ఇంటి అద్దెను ఆదా చేసుకునేందుకు కక్కుర్తి బుద్ధిని ప్రదర్శించాడు. ఆలయం లోపల ఉన్న జ్ఞానప్రసూనాంబిక అతిథిగృహంలో 8వ నెంబరు గదిని తన కోసం కేటాయించుకున్నాడు. దీనిపై ఆరు నెలల నుంచి పలుమార్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. అధికారుల తీరుపై పత్రికల్లో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ఇటీవల కొందరు 8వ గదిలో ఇంజనీరింగ్‌శాఖలోని ఓ అధికారి చేస్తున్న భాగోతంపై దేవదాయశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. లక్షల రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆలయ ప్రాంగణంలో ఉన్న అద్దె గదిలో అపవిత్రమైన చేపలు, మాంసం వంటి వంటకాలు వండుతున్నట్లు పేర్కొన్నారు. అద్దెగదుల్లో ప్రమాదకరమైన విద్యుత్ పరికరాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులో నమోదు చేశారు. దీంతో జ్ఞానప్రసూనాంబిక సదన్‌లోని 8వ నెంబరు గదిని భక్తులకు కేటాయించాలంటూ దేవదాయశాఖ నుంచి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. నాలుగు రోజులపాటు ఆదేశాలను అమలు చేయకుండా ముక్కంటి ఆలయ అధికారులు తమదైన శైలిలో దాటవేశారు. మళ్లీ దేవదాయశాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఇటీవల 8వ నెంబరును కేటాయిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో బిల్లులు నమోదు చేశారు. ఆ తరువాత అదే రసీదుపై మరో అద్దె గది నెంబరు ఇస్తూ భక్తులను బుజ్జగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఓ భక్తుడి కుటుంబానికి సీఆర్వో ఆఫీసులో 8వ నెంబరుతో గదిని కేటాయించారు. వారు అతిథిగృహం వద్దకు చేరుకున్న తరువాత అక్కడ ఉన్న ఓ అధికారి 18వ నెంబరుగా పెన్నుతో రాసి గదిని మార్చి చూపించాడు. దీనిపై భక్తులు ఎందుకు గదిని మారుస్తున్నావంటూ నిలదీశారు. గూడుపుఠాని చేస్తున్న అధికారులు రకరకాల కారణాలు చెబుతూ బుజ్జగించే ప్రయత్నం చేశారు. అసలు ఆ గదిలో ఏముంది... ఆ గదిని ఆన్‌లైన్ బిల్లుద్వారా ఎందుకు కేటాయించారు. మళ్లీ ఎందుకు అనధికారికంగా వేరే గదికి మళ్లిస్తున్నారంటూ భక్తులు ప్రశ్నించారు. దీనిపై మళ్లీ ఆలయ పరిపాలన భవనంలో భక్తుల కుటుంబం ఫిర్యాదు చేసింది. దీంతో 8వ నెంబరు గది వ్యవహారంపై సోమవారం పెద్దఎత్తున దుమారం రేగింది. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆ గదిలో ఏముంది అనే ప్రశ్న పెద్దఎత్తున సర్వత్రా చర్చకు దారి తీసింది. అలయానికి గండికొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


ri Kalahastheeswara Swamy Vari
Devasthanam, Sri Kalahasthi
Accommodation-Counter

t Id	POS4-03062400291213-01502
ee Name	P BASAIAH
no.	+919989298118
of No	XXXXXXXX9621
Persons	2
Details	Sri Gnanaprasunambika Guest House-(AC)-8
Date	03-06-2024
Time	03-06-2024 12:29 AM
Time	04-06-2024 12:29 AM
ce	Rs. 1000.00
unt	Rs. 120.00
ce Charge	Rs. 0.00
nount	Rs. 1120.00
unt	Rs. 2240.00
	(Two Thousand Two

గది నెంబరు 8ని 18గా కేటాయించిన రసీదు

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే

శ్రీకాళహస్తి/సత్యవేడు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల్లో అతి కీలకమైన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం జరనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు మరికొద్ది గంటల్లో వెలువడనుంది. గెలుపోటములు అభ్యర్థులను దోబూచులాడుతుండగా, గెలుపుపై ఎవరికివారు ధీమాతో ఉన్నారు. పోలింగ్ ముగిసిన 20 రోజుల నుంచి గెలిచే అభ్యర్థి ఎవరన్న అంశంపై ప్రజలందరిలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఎట్టకేలకు ఫలితం తేలే రోజు రానేవచ్చింది. మరి కొద్దిగంటల్లోనే గెలుపు తేలిపోనుంది. తిరుపతి పద్మావతి యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో జరిగే ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఇండిపెండింట్లతో కలిపి 15మంది బరిలో నిలిచారు. అయితే ప్రధానంగా టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య మాత్రమే పోటీ నెలకొంది. టీడీపీ అభ్యర్థిగా బొజ్జల సుధీర్ రెడ్డి, వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హోరాహోరీగా పోటీ సాగింది. ఇద్దరు ఎవరికి వారు గెలుపు ధీమాతో ఉన్నారు. సమీకరణాల ప్రకారం గెలుపు లెక్కలను అంచనా వేసుకుంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 293 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఇందు కోసం14 టేబుళ్లను సిద్ధం చేశారు. 21 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఇక పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం మూడు టేబుళ్లను సిద్ధం చేశారు. ఇప్పటికే రాజకీయపార్టీల ఏజెంట్లకు స్పష్టమైన నిబంధనలతో పాసులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నిక ఫలితంపై జనం సర్వత్రా ఎదురుచూస్తున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యనే మాత్రం నెలకొంది. కాగా ఎగ్జిట్ పోల్స్ సర్వేలు టీడీపీకి అనుకూలంగానే రావడంతో గెలుపు ఖాయమనే ధీమాతో టీడీపీ నేతలు ఉన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళి సైతం అలాగే ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా క్రాస్ ఓటింగ్‌పై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రధానంగా నియోజకవర్గంలో అధికార పార్టీ ఓట్లు భారీగా చీలినట్లు తెలుస్తోంది. టీడీపీ తరఫున ఎమ్మెల్యే ఆదిమూలం, వైసీపీ తరఫున రాజేష్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. టీడీపీలో ఆదిమూలంపై ఉన్న అసంతృప్తితో వ్యతిరేక ఓట్లన్నీ గంపగుత్తగా తమకే పడతాయని వైసీపీ భావించింది. కానీ ఎంపీ ఓటింగ్ విషయంలో జరిగిన క్రాస్ ఓటింగ్, నగదు పంపకాల్లో వైసీపీ నాయకుల పక్షపాతం, వైసీపీలో తెరమీదకొచ్చిన స్థానికేతర అంశం, నియోజకవర్గంలో పెద్దిరెడ్డి పెత్తనంపై నాయకుల్లో నెలకొన్న అసంతృప్తి టీడీపీ అభ్యర్థి ఆదిమూలానికి లాభం చేకూర్చేలా ఉందన్న చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసిన జేడీ రాజశేఖర్, యాతాటి రమేష్‌బాబు ఏ మేరకు ఓట్లు రాబట్టగలిగారన్నదే నియోజకవర్గంలో ప్రధాన చర్చగా సాగుతోంది. కాగా, అసెంబ్లీకి సంబంధించి 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. వీటితో పాటు రెండు పోస్టల్ బ్యాలెట్, ఒక ఆర్వో టేబుల్ ఏర్పాటు చేశారు. 20 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు. మధ్యాహ్నం 3.30 కల్లా స్పష్టమైన ఫలితాలు రానున్నాయి.

యువకుడిపై దాడి

శ్రీకాళహస్తి, జూన్ 3: బంధువుల మధ్య కలహాలతో మునిరాజా(38) అనే యువకుడిపై దాడి చేసిన ఘటన తొట్టంబేడు మండలంలోని విరూపాక్షిపురంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుడి కథనం మేరకు... విరుపాక్షిపురం గ్రామానికి చెందిన మునిరాజా ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. ఇతనికి సన్నిహిత బంధువు, తమ్ముడు వరసైన ఓ యువకుడు, బంధువర్గంలో డిగ్రీ చదివే యువతి ఇద్దరు ప్రేమించుకున్నారు. రెండునెలల క్రితం పెద్దలను ఎదరించి వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి బంధువుల మధ్య విబేధాలు తలెత్తాయి. మునిరాజాపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు సోమవారం వాగ్వాదానికి దిగాడు. మాటా మాటపెరగడంతో తలపై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. మునిరాజా చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రిలో చేరాడు.

జూడో అసోసియేషన్ డైరెక్టర్‌గా మల్లికార్జునరెడ్డి

కేవీబీపురం, జూన్ 3: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ నేత పాలగిరి మల్లికార్జునరెడ్డి జూడో అసోసియేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అసోసియేషన్ సీఈవో జొన్నలగడ్డ శైలజాచౌదరి సోమవారం నాయుడుపేటలో మల్లికార్జునరెడ్డి చేత ప్రమాణస్వీకారం చేయించారు.

గంధమనేని పారిజాతమ్మకు ప్రముఖుల నివాళి

పిచ్చాటూరు, జూన్ 3: పుత్తూరు మాజీ ఎమ్మెల్యే గంధమనేని శివయ్య సతీమణి గంధమనేని పారిజాతమ్మ అంత్యక్రియలు చెన్నై కోడంబాక్కంలోని ఎన్‌టీఆర్ స్ట్రీట్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.నారాయణ, డీసీసీబీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు గంధమనేని హరీష్‌నాయుడుతో పాటు పలువురు నాయకులు పారిజాతమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె కుమారుడు గౌతమ్, కుమార్తె విజయలక్ష్మి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం సీపీఐ నేత నారాయణ మాట్లాడుతూ గంధమనేని శివయ్య కుటుంబం తనకు, తన కుటుంబానికి సన్నిహితంగా ఉండేదన్నారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన శివయ్య ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినా, అతను, అతని కుటుంబం సాధారణ జీవితాన్ని గడిపారని కొనియాడారు. 1970వ దశకంలోనే శివయ్య వ్యవసాయంపై సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని తెలిపారు. రేణిగుంట వద్ద గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ రావడానికి శివయ్య ప్రధాన భూమిక పోషించారన్నారు. శివయ్య అభ్యున్నతికి సతీమణిగా పారిజాతమ్మ తోడ్పాటు ఎంతో ఉందన్నారు. దంపతులిద్దరూ తమ తుదిశ్వాశ వరకు వామపక్ష బావజాలాన్నే అనుసరించడం గర్వంగా ఉందన్నారు. అలాగే ఆలిండియా హ్యాండ్ లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కె.కల్యాణ్ చక్రవర్తి, ఉమ్మడి చిత్తూరు డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జి.హరీష్ నాయుడు, సీపీఐ జిల్లా నేత రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నిరాజ్, పిచ్చాటూరు మాజీ జడ్పీటీసీ సభ్యులు జి.బాలాజీనాయుడు తదితరులు పారిజాతమ్మకు నివాళులర్పించారు.


పారిజాతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు, సీపీఐ నేత నారాయణ

తహసీల్దారు కార్యాలయానికి లాప్‌టాప్, ప్రింటర్ వితరణ

వరదయ్యపాళెం, జూన్ 3: వరదయ్యపాళెం తహసీల్దారు కార్యాలయానికి అపోలో పరిశ్రమ యాజమాన్యం లాప్‌టాప్, ప్రింటర్‌ను సోమవారం వితరణ చేసింది. తమ కార్యాలయానికి ప్రింటర్, కంప్యూటర్ కావాలని తహసీల్దారు ఉదయభారతి కోరడంతో స్పందించిన అపోలో పరిశ్రమ రూ.3.75లక్షలు విలువ చేసే 3 లాప్‌టాప్‌లు, 3హైటెక్నాలజీ ప్రింటర్లను అందజేసింది.

పుత్తూరు వార్తలు

పింఛన్ కోసం వెళ్లి...

వడదెబ్బతో వృద్ధుడి మృతి


కిష్టప్ప(ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, జూన్ 3: పింఛన్ కోసం వెళ్లిన వృద్ధుడు ఎండవేడిమి తాళలేక మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.... పుత్తూరు పట్టణ పరిధిలోని ఆరేటమ్మ ఎస్టీ కాలనీకి చెందిన కే.కృష్ణప్ప వృద్ధాప్య పింఛన్ కోసం కల్యాణపురం సచివాలయానికి ఆదివారం వెళ్లాడు. క్యూలైన్‌లో నిలబడి ఉండగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. సచివాలయ సిబ్బంది సమాచారంతో కుటుంబసభ్యులు కిష్టప్పను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

ది జడ్జ్‌మెంట్ డే

- కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- గెలుపుపై ఇరుపార్టీల్లో ధీమా
- మధ్యాహ్నానికి ఫలితం వెల్లడయ్యే అవకాశం

పుత్తూరు అర్బన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో విజేతలెవరో నేడు వెల్లడికానుంది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల ఘట్టం ఆఖరి అంకానికి చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నానానికి విజయం ఎవరిని వరించనుందో తేలిపోనుంది. చిత్తూరు ఎస్వీపీసెట్‌లో నగరి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. మధ్యాహ్నానికి ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా గెలుపుపై ఇరుపార్టీల అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. కౌటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతలు అదుపుతప్పకుండా పోలీసులు నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

మొత్తం 17 రౌండ్లు

నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 229 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1,76,399 ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. దీనికిగాను మరో 3 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభవుతుంది. తొలి ఫలితం 9 గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం ప్రక్రియ మధ్యాహ్నానికి పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గెలుపుపై ధీమాగా పార్టీలు

గెలుపుపై టీడీపీ, వైసీపీ పార్టీలు ధీమాగా ఉన్నారు. నగరి అసెంబ్లీ సీటు టీడీపీ కైవసం చేసుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తుండడంతో ఆ పార్టీలో నూతనోత్సాహం తొణికిసలాడుతోంది. గత రెండు ఎన్నికల్లో స్వల్ప ఓట్ల మెజార్టీతో సీటు కోల్పోయిన టీడీపీ ఈ దఫా ఎన్నికల సంగ్రామంలో హోరాహోరీగా తలపడ్డాయి. అయితే టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌పై ఓటర్లలో ఉన్న సానుభూతితో పాటు టీడీపీ కూటమి పట్ల ఉన్న సానుకూలత తమను విజయతీరాలకు చేరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాలే తమను గెలుపుతీరాలకు చేరుస్తాయని వైసీపీ అంచనా వేస్తోంది. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి ఆర్కే రోజాపై ప్రజా వ్యతిరేకతతో పాటు, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తమను ఎక్కడ ముంచుతాయోనని అంతర్గత చర్చల్లో సంభాషించుకుంటున్నారు. దీనికి తోడు కీలకమైన పోల్‌మేనేజ్‌మెంట్, బూత్ మేనేజ్‌మెంట్‌లో వైసీపీ చేతులెత్తేసిందనే అంచనాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు గెలుపుపై పైకి గంభీరంగా ఉన్నప్పటికీ లోలోన మాత్రం ఆందోళనతోనే ఉన్నారు. తీవ్ర ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికల్లో నగరి గడ్డపై జెండా ఎగురవేసేది ఎవరనేది మంగళవారం మధ్యాహ్నానానికి తెలిసిపోనుంది.